సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 18 । జూలై । 2023



బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సు ఓ యువ కుడి ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో జరిగింది. 8లో▸



20న ప్రారంభం

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 20న మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. 8లో▸



పెద్ద ఆస్పత్రిలో.. కష్టాలు

పెద్ద ఆస్పత్రిలో పేదలకు కష్టాలు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులు గొప్పలు చెబుతున్నా రోగుల పాట్లు అలాగే ఉన్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయం (మహేశ్వరం గేటు) వద్ద ఉన్న బాలుర డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ విభాగాల్లో మిగిలిన సీట్ల భర్తీకి పురుష విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విరూపాక్షప్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్)తో సహా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని వచ్చి నేరుగా కళాశాలలో అడ్మిషన్ పొందాలన్నారు. ఉచిత వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం 94400 52739, 95028 42484 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో షార్ట్‌సర్క్యూట్



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: ప్రైవేట్ ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి సకాలంలో చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటన పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పరిగి రోడ్డులోని షాద్‌నగర్ సూపర్ స్పెషాలిటీ (ప్రైవేట్) ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఐసీయూ విభాగంలో దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఆస్పత్రిలో ఉన్న వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఇం‘డర్’స్ట్రియల్!

- పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు
- కనీస భద్రత చర్యలు కరువు
- ప్రమాదాల బారిన కార్మికులు
- పట్టించుకోని యాజమాన్యాలు
- తాజాగా బ్లైండ్ కలర్ పరిశ్రమలో పేలుడు ఘటనే నిదర్శనం
- చర్యలు తీసుకోవాలంటున్న కార్మిక సంఘాల నేతలు



పరిశ్రమ గేటును తోసుకుంటూ లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

షాద్‌నగర్: వారంతా ఇతర రాష్ట్రాల నుంచి పొట్ట చేత పట్టుకుని వలస వచ్చారు.. స్థానిక పరిశ్రమలను నమ్ముకొని రెక్కల కష్టంతో కడుపు నింపుకొంటున్నారు.. వారి శ్రమతో లాభాలు ఆర్జిస్తున్న యాజమాన్యాలు మాత్రం అడుగడుగునా నిర్లక్ష్యం కనబరుస్తున్నాయి.. భద్రతాప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.. తాజాగా షాద్‌నగర్ పరిధిలోని బ్లైండ్ కలర్స్ పరిశ్రమలో జరిగిన ఘటన మరోసారి యాజమాన్యం నిర్లక్ష్యాన్ని చాటుతోంది. ఈ పరిశ్రమలో కలర్స్ తయారు చేసే యంత్రం పేలిన ఘటనలో పదిమంది మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ ఘటన ఒక్కసారిగా కార్మికుల్లో భయందోళనలు సృష్టించింది. కార్మికుల రక్షణను మరోసారి ప్రశ్నార్థకం చేసింది.

ఇదీ జరిగింది..

షాద్‌నగర్ పరిధిలోని కాశిరెడ్డిగూడ శివారులో బ్లైండ్ కలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఆదివారం రాత్రి పరిమితికి మించిన వేడి (ఓవర్ హీట్)తో రంగులు తయారు చేసే యంత్రం పేలడం, అందులో ఉన్న ప్లాస్టిక్‌తో కూడిన ద్రవంలాంటి పదార్థం కార్మికుల మీద పడడం వెనువెంటనే జరిగిపోయాయి. ఊహించని ఈ పరిణామంతో కార్మికులు హాహాకారాలు చేస్తూ బయటికి పరుగులు తీశారు. గాయపడిన 11 మంది కార్మికులను వాహనాల్లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి అటు నుంచి హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ ఆస్పత్రికి తరలించారు. ఒడిశా, బీహార్, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి బతుకుతెరువు వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చిన వలస కార్మికులు ప్రస్తుతం చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

పరిశ్రమ ఎదుట ఆందోళన

సోమవారం ఉదయం పరిశ్రమ ఎదుట ఏఐటీయూసీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన నాయకులను సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు గేటు వద్దే నిలువరించారు. దీంతో ఆగ్రహానికి గురైన కార్మిక సంఘాల నేతలు బలవంతంగా గేటు తీసుకొని లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట, వాగ్వాదం చోటు చేసుకున్నాయి. పరిశ్రమ గేటు ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ రంగస్వామి, సీఐ ప్రతాప్ లింగం సందర్శించారు. దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

కనీస జాగ్రత్తలు ఏవీ?

కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో వందల సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. పలు పరిశ్రమల్లో కార్మికుల పరిరక్షణ కోసం కనీస జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదు. యంత్రాల మధ్య పని చేసేవారికి రక్షణ పరికరాలను సమకూర్చడం లేదు. అనుభవం ఉన్న కార్మికులను విధుల్లో పెట్టుకుంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో చాలా పరిశ్రమల్లో అనుభవం లేనివారిని పనిలో పెట్టుకోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ప్రమాదాలు జరిగినా సంబంధిత పరిశ్రమల నిర్వాహకులు విషయం బయటకు పొక్కనీయడం లేదు. పరిశ్రమల్లో భద్రతా అధికారి నిత్యం కార్మికుల భద్రతపై అవగాహన కల్పించాల్సి ఉన్నా, ప్రమాదాలను ఎలా నివారించాలన్న అంశంపై తరుచూ ప్రదర్శనలు నిర్వహించాలని నిబంధనలున్నా పాటించిన దాఖలాలు లేవు. పరిశ్రమ శాఖ తరఫున తనిఖీలు నిర్వహించడం లేదు.



బ్లైండ్ కలర్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశం ఇదే..

గతంలో జరిగిన కొన్ని ప్రమాదాలు..

- 2012లో షాద్‌నగర్ శివారులోని స్టీమ్ కోర్ పరిశ్రమలో బాయిలర్ పేలి 12 మంది కార్మికులు మృతి చెందారు.
- 2015లో కొత్తూరు వినాయక స్టీల్ పరిశ్రమలో ఫర్నెస్ పేలి పది మంది మృత్యువాత పడ్డారు.
- తీగాపూర్ శివారులోని పాత టైర్లను కాల్చే పరిశ్రమలో బాయిలర్ పేలి నలుగురు, నందిగామ పరిధిలోని శివశక్తి, జాగృతి, షాద్‌నగర్ పరిధిలోని ఎలికట్ట, మొగిలిగిద్ద శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో పదిమందికి పైగా కార్మికులు మృతి చెందారు. ఎంతో మంది గాయాలపాలయ్యారు. చిన్నచిన్న పరిశ్రమల్లో అడపాదడపా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

“కార్మికులకు భద్రత కరువు



పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు భద్రత లేకుండా పోతోంది. యంత్రాల మధ్య పని చేస్తున్నా రక్షణ పరికరాలు కూడా ఇవ్వడం లేదు. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలి.

– శ్రీను, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి

పరిహారం అందించాలి



యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే పరిశ్రమలో పేలుడు జరిగింది. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు యాజమాన్యం ఒక్కొక్కరికి రూ.50లక్షల చొప్పున పరిహారం అందించాలి.

– రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు

ప్రమాదం బాధాకరం



ప్రమాదంలో 11 మంది కార్మికులు తీవ్రంగా గాయపడటం బాధాకరం. పరిహారం చెల్లించడంతో పాటు కార్మికులు కోలుకునే వరకు వైద్య ఖర్చులను యాజమాన్యమే భరించాలి.

– యాదయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

దర్యాప్తు చేపడుతున్నాం



బ్లైండ్ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నాం. పరిశ్రమలో ప్రమాదం ఏవిధంగా జరిగిందన్న కోణంలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– రంగస్వామి, ఏసీపీ, షాద్‌నగర్

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య

ఇబ్రహీంపట్నం: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య డిమాండ్ చేశారు. గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులు టీచింగ్‌తోపాటు ఇతర బాధ్యతలను ఎక్కువగా నిర్వహించడంతో పని ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి సమస్యలను గొంతెత్తి బయటకు చెప్పడానికి కూడా స్వేచ్ఛలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. టీఎస్ఆర్ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ విద్యాసంస్థల్లో బోధన సమయాన్ని ఇతర సొసైటీల మాదిరిగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉండేలా మార్చాలని, పీవో 2018కు అనుగుణంగా చేసిన రీ అలైన్మెంట్‌పై ఉపాధ్యాయులకు కంబైన్డ్ సీనియారిటీ వర్తింపజేయాలని, ప్రతి పాఠశాలకు అదనంగా ఒక ఏఎన్ఎంను ఇవ్వాలని, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్ పోస్టులను గ్రేడ్–1గా అప్‌గ్రేడ్ చేయాలని, 2018, 2019లో నియామకమైన ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలకు శాశ్వత భవనాలు, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు గోపాల్‌నాయక్, ఎం.వెంకటప్ప, రాములయ్య, కల్పన, జగన్నాథం, నాగేంద్రం, భగవంత్‌రాజ్, భువనేశ్వరి, సుగంధ, మైపాల్, మాజిద్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాలయ్య

‘పెద్ద’లకు వరం.. జీఓ నంబర్ 59

- క్రమబద్ధీకరణ పేరుతో ప్రభుత్వ భూములు స్వాహా
- బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకే అప్పగిస్తున్న వైనం
- నేతల దరఖాస్తులకు మోక్షం కల్పించి.. సామాన్యులవి తిరస్కరిస్తున్న వైనం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గ్రేటర్‌లో దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే విధంగా వ్యవరిస్తున్నారు కొందరు తహసీల్దార్లు. ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర సర్కారు జీవో 58, 59ను ప్రవేశపెట్టింది. కేవలం పేదలకు ఉద్దేశించిన ఈ జీఓ ఇప్పుడు ‘పెద్ద’లకు వరంగా మారింది. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో తహసీల్దార్లను బదిలీ చేసేందుకు రంగం సిద్ధమవుతుండగా..ఇదే అదునుగా రెవెన్యూ యంత్రాంగం స్థలాల క్రమబద్ధీకరణను వాయువేగంతో చేస్తోంది. జిల్లాలో మూడేళ్లుగా పనిచేస్తున్న తహసీల్దార్లకు స్థానచలనం కలిగించాలని ఈసీ ఆదేశించింది. ఈ క్రమంలోనే రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల్లో పనిచేస్తున్న మెజార్టీ తహసీల్దార్లకు బదిలీలు వర్తించనున్నాయి. దీంతో జీఓ 59 కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారాన్ని యుద్ధప్రాతిపదికన వీరు పూర్తి చేస్తున్నారు.

మీకింత..మాకింత

ప్రభుత్వం కూడా ఈ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడాన్ని అనువుగా మలుచుకొని స్థలాల క్రమబద్ధీకరణను ఎడాపెడా చేసేస్తున్నారు. ఇందులో రియల్టర్లు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలతో మిలాఖత్ అయి..స్థలాల క్రమబద్ధీకరణలో ‘మీకింత..మాకింత’ అన్న చందంగా ఆమోదముద్ర వేయడమే కాదు.. డిమాండ్ నోటీసులను కూడా అదే వేగంతో జారీ చేస్తున్నారు.

సామాన్యుల దరఖాస్తులను పక్కన పెట్టి...

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్ జిల్లాలో జీఓ నంబర్ 58 కింద 8,425 దరఖాస్తులు రాగా, జీఓ నంబర్ 59 కింద 2,897 దరఖాస్తులు అందాయి. అదే విధంగా మేడ్చల్ జిల్లాలో ఈ రెండు జీఓల కింద 53,085 వేల దరఖాస్తులు, రంగారెడ్డి జిల్లాలో 58,742 దరఖాస్తులు అందాయి. వీటిలో సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజల దరఖాస్తులను పక్కన పెట్టి.. ప్రజాప్రతినిధుల, రియల్టర్ల దరఖాస్తుల పరిశీలన మాత్రం వేగంగా పూర్తవుతుంది. ముఖ్యంగా ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్, గండిపేట్, బాలాపూర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం మండలాల్లోని ఖరీదైన భూముల దరఖాస్తులను అడ్డగోలుగా ఆమోదిస్తున్నట్లు తెలిసింది.

ఇక తహసీల్దార్ల వంతు...

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలోని రెవెన్యూ యంత్రాంగంలో భారీ ఎత్తున బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో ప్రత్యక్ష, పరోక్ష సంబంధముండే అధికారుల బదిలీలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన మేరకు ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే అదనపు కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులు, ఆర్డీవోలు, స్పెషల్ గ్రేడ్, డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగాయి. ఇక రెండు మూడు రోజుల్లో తహసీల్దార్ల బదిలీలు కూడా జరుగనున్నాయి.

70 శాతం మందికి బదిలీ తప్పదు..

గత లోకసభ ఎన్నికల తర్వాత తహసీల్దార్ల బదిలీలు జరగలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా విధుల్లో చేరినవారు, 317 జీవో ద్వారా స్థానికత ప్రాతిపదికన సర్దుబాటైనవారు మినహా 70 శాతం మంది తహసీల్దార్ల బదిలీలకు అవకాశం కనిపిస్తోంది. జిల్లాల వారిగా పరిశీలిస్తే హైదరాబాద్ జిల్లాలో 29, రంగారెడ్డి జిల్లాలో 27, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 27 మంది తహసీల్దార్లు ఉండగా, వారిలో సుమారు 70 శాతం మందిపై బదిలీ వేటు పడనున్నట్లు తెలుస్తోంది.

కుదుపు: ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వహించేందుకు అవసరమైన డిప్యూటీ కలెక్టర్ (ఆర్డీవో) స్థాయి అధికారులపై బదిలీ వేటు పడింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో, సీఈఎం విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సూర్యలత, యూఎల్‌సీ ఎస్‌జీడీసీగా విధులు నిర్వహిస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హైదరాబాద్ ఆర్డీవో వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ ఆర్డీవో వసంతకుమారి, న్యాయాధికారి సంగీత, రంగారెడ్డి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతి రావు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతీక్ జైన్ , మేడ్చల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎనుగు నర్సింహారెడ్డి, డీఆర్వో లింగా నాయక్, మల్కాజిగిరి ఆర్‌డీవో మల్లయ్య, రాజేంద్రనగర్ ఆర్డీవో చంద్రకళ , ఇబ్రహీంపట్నం ఆర్డీవో వెంకటాచారి, కీసర ఆర్డీవో రవి బదిలీ అయ్యారు.

బోనాలపై ప్రత్యేక ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో జరుగుతున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ఎదుట ఆది, సోమవారాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. త్రీడీ మ్యాపింగ్, ఎల్ఈడీ మ్యాపింగ్‌తో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా నిర్వహించే బోనాలు, బోనాల సందర్భంగా సర్వశక్తి స్వరూపిణి అయిన అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకోవడం, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, తదితర అంశాలను ప్రదర్శించారు. , నగరంలోని వివిధ ఆలయాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం, మంత్రుల నుంచి వివిధ రంగాల్లోని ప్రముఖులు భక్తి ప్రపత్తులతో అమ్మవారిని దర్శించుకోవడం, ఆయా ఆలయాల ప్రశస్తి, తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాలను తిలకించారు.



సాధారణం కంటే తక్కువే..

- 23 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదు
- ఒట్టిపోయిన చెరువులు, కుంటలు
- పంటల సాగు అంతంతే..
- తగ్గిన కాయగూరల దిగుబడి.. పెరిగిన ధరలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అదను దాటిపోతోంది. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంటసాగు ప్రశ్నార్థకంగా మారింది. కొంత మంది రైతులు అదను దాటిపోతుందనే భావనతో భూమిలో పత్తి, కంది, జొన్న, మొక్కజొన్న, పెసర వంటి పంటలను విత్తారు. కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు మొలకెత్తాయి. మరికొన్ని ప్రాంతాల్లో మట్టిలో కలిసిపోయాయి. మొలిచిన మొక్కలు సైతం వర్షాలు లేకపోవడంతో వాడిపోతుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్కడక్కడా చిరుజల్లులు కురిసినా.. మొక్కలను కాపాడాలేక పోతున్నాయి. ఇప్పటికే మొలకెత్తిన విత్తనాలు వర్షాభావంతో వాడిపోతుండడంతో వాటి స్థానంలో మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి విత్తాల్సి వస్తుండడం రైతులకు ఇబ్బందిగా మారింది.

పాతాళానికి భూగర్భ జలాలు

జిల్లాలో సగటు సాధారణ వర్షపాతం 94 ఎంఎంలు కాగా, ఇప్పటి వరకు 15.3 ఎంఎంల వర్షపాతం మాత్రమే నమోదైంది. జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటిలో రెండు మండలాలు మినహా మిగిలిన ఐదు మండలాల్లో సాధారణం కన్నా తక్కువగా, 18 మండలాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. గత రెండేళ్లతో పోలిస్తే వర్షపాతం నమోదులో ఈసారి భారీ వ్యత్యాసం నమోదైంది. ప్రస్తు తం చెరువులు, కుంటలన్నీ ఒట్టిపోయాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. ఇప్పటికే మడులు దున్ని నార్లు పోసుకున్న రైతులు.. వర్షాభావంతో మోటార్లు కూడా సరిగా పనిచేయక పోవడంతో నారుమడులు సైతం ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

పంటల సాగు అంతంతే..

2022–23వ సంవత్సరం వానాకాలం సీజన్‌లో 4,59,181 ఎకరాల్లో పంటలను విత్తాలని లక్ష్యంగా పెట్టుకుని, 3,94,670 ఎకరాల్లో సాగు చేశారు. యాసంగి సీజన్‌లో 1,39,051 ఎకరాల్లో పంటను నాటాలని నిర్ణయించి లక్ష్యానికి మించి 5,33,721 ఎకరాల్లో సాగు చేశారు. రెండు సీజన్లలోనూ అత్యధికంగా వరి, పత్తి పంటలనే ఎక్కువ మంది సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో నిర్దేశిత లక్ష్యం మేరకు పంట సాగు చేయలేదు. ఒకటి రెండు మోస్తరు వర్షాలకు రైతులు దుక్కులు దున్ని భూమిలో విత్తనాలు విత్తారు. ఆయా విత్తనాలు మొలకెత్తకపోగా.. రైతులకు మళ్లీ విత్తనాలు, కూలీల భారం తప్పలేదు.

భగ్గుమంటున్న కాయగూరల ధరలు

కేవలం వరి, పత్తి, కంది వంటి పంటలే కాదు కూరగాయల సాగుపై కూడా వర్షాభావం తీవ్ర ప్రభావం చూపుతోంది. బోర్ల కింద కింద పొలాలు పూర్తిగా వట్టిపోయాయి. నీరు లేకపోవడంతో ఆకుకూ రలు, కాయగూరలను సాగు చేయలేని దుస్థితి. డిమాండ్ మేరకు కూరగాయలు, ఆకుకూరల దిగుమతి లేకపోవడంతో ప్రస్తుతం మార్కెట్లో ధరలు భగ్గున మండుతున్నాయి. టమాటా, పచ్చిమిర్చి ధర ఇప్పటికే కిలో రూ.వంద దాటగా.. మిగిలిన కూరగాయలన్నీ కేజీ రూ.60 పైమాటే. కందిపప్పు, పెసరపప్పు, వేరుశనగ వంటి పప్పు దినుసుల ధరలు సైతం భగ్గుమంటున్నాయి. ఇప్పటి వరకు ఆయా పంటలను సాగు చేయక పోవడంతో భవిష్యత్తులో వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.

2022-23లో పంటల విస్తీర్ణం (ఎకరాల్లో..)

పంట	వానాకాలం	యాసంగి
వరి	1,25,457	2,16,289
జొన్న	4,144	4,798
సజ్జ	15	40
మొక్కజొన్న	62,136	75,668
రాగులు	37	37
ఉలవలు	83	98
పెసలు	53	64
మినుములు	35	39
కందులు	12,077	12,093
బెబ్బర్లు	17	22
మిరప	457	553
ఉల్లి	36	264
పత్తి	1,35,193	1,35,193
వేరుశనగ	55	4,967
నువ్వులు	13	19
పొద్దు తిరుగుడు	13	674
కుసుమ	24	5,319
ఆముదం	50	247
సోయాబీన్	92	94
ఇతర పంటలు	54,599	72,699

ఘటం.. ఘనం

బోనాల వేడుకల్లో భాగంగా సోమవారం పాత బస్తీ చార్మినార్ ప్రధాన వీధుల్లో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం అమ్మవారి ఘటం అంబారిపై ఊరేగింపులో ముందు వరుసలో ఉండగా.. మిగిలిన ప్రధాన దేవాలయాల ఘటాలు వెనుక అనుసరించాయి. ఇక ప్రధాన దేవాలయాల్లో భవిష్యవాణి కార్యక్రమం జరిగిన అనంతరం సామూహిక ఊరేగింపు భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. రంగురంగుల శకటాలు, కళాకారుల నృత్య ప్రదర్శనలు, పోతురాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయం వద్ద భక్తజన సందోహం

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

యువకుడి దుర్మరణం

మొయినాబాద్: అతివేగంతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఓ యువకుడి ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శిరీష తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, బీరంగూడ ప్రాంతానికి చెందిన వెలగలేటి భాస్కర్(29) ఆర్‌సీపురంలో బేకరీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఉదయం 9గంటల ప్రాంతంలో తన బుల్లెట్ బైక్‌పై మొయినాబాద్ నుంచి మెహదీపట్నం వైపు ప్రయాణిస్తున్నాడు. తాండూరు నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడగా భాస్కర్ బస్సు వెనుక చక్రాల కిందపడిపోయాడు. అతని తలపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

మొయినాబాద్ వైపు ఎందుకొచ్చాడు..?

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భాస్కర్ మొయినాబాద్‌కు ఎందుకు వచ్చాడో అంతుచిక్కడంలేదు. ఆర్‌సీ పురంలో బేకరీ మేనేజర్‌గా పనిచేసే భాస్కర్ ఆదివారం రాత్రి ఇంటికి రాలేదని... అతనికి ఫోన్‌చేసినా కలవలేదని.. అసలు మొయినాబాద్‌కు ఎందుకొచ్చాడో తమకు తెలియదని కుటుంబ సభ్యులు అన్నారు. ఎవరికీ చెప్పకుండా వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్నాడని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

20న బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభం


బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభానికి ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 20న ఐటీ మంత్రి కేటీఆర్ ఈ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. సోమవారం ఆయన శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభించిన అనంతరం జిల్లా స్థాయిలో పూర్తిస్థాయి కమిటీని నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, కౌన్సిలర్లు భారతమ్మ, మేకల వెంకటేశ్ ముదిరాజ్ నాయకులు శ్రీనివాస్, తాజ్ బాబా తదితరులున్నారు.

బాల కార్మికుడికి విముక్తి

ఇబ్రహీంపట్నం రూరల్: వెట్టి చాకిరి చేస్తున్న ఓ బాలుడికి విముక్తి కల్పించిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్ సమీపంలోని అంబిక మాత హార్డ్‌వేర్ దుకాణంలో ఓ బాలుడి(17)తో యజమాని పేమరామ్ పనులు చేయించుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చైల్డ్ లైన్ టీం సభ్యుడు బొడ్డుపల్లి నర్సింహా ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని అతని సోదరి వద్దకు పంపించారు. యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దుకాణం యజమాని బాలుడికి బావ కావడం విశేషం.

ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో వివాదం

బీజేపీ కార్యకర్తపై బీఆర్‌ఎస్ నేత దాడి


గాయపడిన బీజేపీ కార్యకర్త సుధీర్

మీర్‌పేట: ఫ్లెక్సీ విషయంలో జరిగిన గొడవలో బీరు సీసాతో యువకుడిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవిందుస్వామి కథనం ప్రకారం.. ఆదివారం బోనాల పండుగ సందర్భంగా బడంగ్‌పేట గాంధీనగర్‌లో బీజేపీ జెండా దిమ్మెకు బీఆర్‌ఎస్‌కు చెందిన వారు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో బీజేపీ కార్యకర్త సుధీర్ అక్కడికి చేరుకుని ఫ్లెక్సీలను తొలగించాడు. విషయం తెలుసుకున్న మల్లేశ్ అనే వ్యక్తి సుధీర్‌ను ఇంటికి పిలిపించుకుని ఫ్లెక్సీ తొలగింపు విషయమై మాట్లాడుతుండగా పక్కనే ఉన్న ఒంటెపాక శ్రీరామ్ బీరు సీసాతో తలపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

తల్లీపిల్లలు అదృశ్యం


అదృశ్యమైన తల్లీపిల్లలు (ఫైల్)

కడ్తాల్: ఇద్దరు కుమారులతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన ఆమనగల్లు పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బలరాం తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన బన్నె చంద్రశేఖర్, దివ్య భార్యాభర్తలు. వీరికి చరణ్ తేజ, సాయితేజ సంతానం. ఈ నెల 12న చంద్రశేఖర్ కూలీ పనులకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూడగా భార్యాపిల్లలు కనిపించలేదు. దీంతో ఆయన ఇంటి చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు ఆయన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పెద్ద ఆస్పత్రిలో.. పేదల కష్టాలు

పెద్ద ఆస్పత్రిలో పేదలకు కష్టాలు తప్పడం లేదు. ప్రజా ప్రతినిధులు గొప్పలు చెబుతున్నా రోగులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం కాంగ్రెస్ నాయకులు ఆస్పత్రిని సందర్శించి విస్తుపోయారు.

- 300 మందికి ఒక్కరే వైద్యుడు
- చేవెళ్ల ఆస్పత్రిని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు
- నిర్వహణ తీరుపై ఆగ్రహం


ఉన్నతాధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్‌నాయకులు


వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు


తాళం వేసి ఉన్న ఫార్మసిస్ట్ గది

చేవెళ్ల: ప్రతీ రోజు సుమారు మూడు వందల మంది ఓపీ వచ్చే ఆసుపత్రిలో ఒక్కరే వైద్యుడు రోగులను పరీక్షిస్తున్నారు. సోమవారం ఉదయం కాంగ్రెస్ నాయకులు చేవెళ్ల ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులు బారులు తీరడంతో లోపలికి వెళ్లి పరిశీలించారు. పేరుకు 11 మంది వైద్యులున్నా ఒక్క డాక్టర్ కార్తికేయన్ మాత్రమే వైద్యం అందిస్తున్నారు. మధ్యాహ్నం 12గంటలు దాటినా ఫార్మసిస్ట్ గది తాళం తీయలేదు. కింది స్థాయి సిబ్బంది ఒకరు రోగులకు మందులిస్తూ కన్పించారు. రోగులు వైద్య సేవలు సరిగా అందడం లేదని మందులకు రేపు రావలంటున్నారని కాంగ్రెస్ నేతలకు చెప్పారు.

నలుగురు డిప్యూటేషన్.. ఇద్దరు లీవ్.. ఒకరు నైట్ డ్యూటీ

ఆస్పత్రిలో ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని తెలుసుకోగా 11 మంది వైద్యులకు నలుగురు డిప్యూటేషన్‌పై వేరే ఆస్పత్రులకు వెళ్లారని.. ఇద్దరు లీవ్‌లో ఉండగా మరొకరు నైట్ డ్యూటీ చేసి వెళ్లారని డాక్టర్ కార్తికేయన్ చెప్పారు. మరో ఇద్దరిలో గైనకాలజిస్ట్, డెంటల్ వైద్యులు ప్రతీ శుక్రవారం వస్తారని చెప్పారు. పోస్టులు అన్ని ఉన్నాయని వైద్యం చేసేందుకు ఒక్కరే ఉండడమేమిటని ప్రశ్నించారు. ఓపీ సమయంలో వైద్యులు ఉండకపోతే పేదలకు వైద్యం అందుతుందని మండి పడ్డారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు, కలెక్టర్, వైద్యశాఖ కమిషనర్ దృష్టికి తీసుకుపోతామని చెప్పారు.

తీరు మారకపోతే ఆందోళన చేస్తాం

చేవెళ్ల ఆస్పత్రి నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యులను వెంటనే రప్పించాలని, ఆసుపత్రికి హాజరవ్వని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌ఎస్‌కు కాంగ్రెస్‌నాయకుడు సున్నపు వసంతం ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో ఆసుపత్రి తీరు మారకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆసుపత్రిని సందర్శించిన వారిలో డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు రాములు, డీసీసీ నాయకులు పెంటయ్యగౌడ్, మధుసుధన్‌గుప్తా, నాయకులు మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాండుయాదవ్, బి.శ్రీనివాస్, మానిక్యం, హనీఫ్, బాలయ్య, వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి


అభివాదం చేస్తున్న చేస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బాబుమాదిగ

మహేశ్వరం: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రావుగళ్ల బాబు మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంతో వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో మాదిగ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి తొమ్మిదేళ్లయినా నేటికీ కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేస్తోందన్నారు. మాదిగల ఓట్లతో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 20న నియోజకవర్గ కేంద్రానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రానున్నట్లు చెప్పారు. ఆయనకు మాదిగలంతా ఘన స్వాగతం పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్, మాదాపూర్ సర్పంచ్ మంద సాయిలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సాయిలు, నర్సింహ, మల్లేశ్, యాదయ్య, వెంకటయ్య, రంజిత్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహ, రవి, కృష్ణ మాదిగ, నవీన్, శేఖర్, అర్జున్, జంగయ్య, ప్రశాంత్, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిళ్లు ఇవ్వనందుకు..

యువకుడిపై కత్తితో దాడి

మీర్‌పేట: బీరు బాటిళ్లు ఇవ్వనందుకు వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సరూర్‌నగర్‌కు చెందిన సాయి వరప్రసాద్(22) డిగ్రీ చదువుతున్నాడు. మీర్‌పేట సర్వోదయ కాలనీకి చెందిన నేతల సాయి యాదవ్(23)లు ఆదివారం అర్ధరాత్రి బీరు బాటిళ్లు తీసుకొని జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్ హోటల్ వద్ద వెళ్తుండగా అక్కడే ఉన్న పల్లె నిలీష్‌గౌడ్, కిరణ్‌గౌడ్, సంతోష్ యాదవ్, పవన్ వారిని అడ్డగించి బీరు బాటిళ్లు ఇవ్వాలని దబాయించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇంతలో పల్లె నిలీష్‌గౌడ్ తన వద్ద ఉన్న కత్తితో సాయి వరప్రసాద్‌పై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఓవైసీ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టుషాపుపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

నిర్వాహకుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ బెల్టు షాపుపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్‌లో నివాసం ఉండే సబావత్ చందు టీ కొట్టు నడుపుతూ జీవించేవాడు. ఆదివారం బోనాల సందర్భంగా హెచ్‌పీ పెట్రోల్‌బంక్ ప్రక్కనే ఉన్న ఖాళీ జాగాలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టారు. విషయం తె లుసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దా డి చేశారు. నిర్వాహకుడి వద్ద నుంచి 116 ఓసీ క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమో దు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఓఆర్ఆర్‌పై రెండు కంటైనర్లు ఢీ..

వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: రోడ్డు పక్కన నిలిపిన కంటైనర్‌ను మరో కంటైనర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఘట్కేసర్ వైపు నుంచి పెద్దఅంబర్‌పేటకు వచ్చే మార్గంలో ఓఆర్ఆర్‌పై రోడ్డు పక్కన ఓ కంటైనర్‌లారీ నిలిపారు. ఘట్కేసర్ నుంచి వస్తున్న మరో కంటైనర్ లారీ నిలిపిఉన్న కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బరగడ శ్రీనివాస్‌రావు(50) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు హయత్‌నగర్‌లో నివాసంఉంటూ ట్రాన్స్‌పోర్టు లారీలకు గైడ్‌గా పనిచేస్తున్నాడు.


ఆగిఉన్న కంటైనర్‌ను ఢీకొట్టిన మరో కంటైనర్

జూనియర్ ఆర్టిస్టులపై దాడి

బంజారాహిల్స్: అద్దెకు తీసుకున్న సఫారీ దుస్తులు ఇచ్చేందుకు వెళ్లిన జూనియర్ ఆర్టిస్టులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... బోనాల పండుగను పురస్కరించుకుని యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక నాయకుడు నవీన్ యాదవ్ విందు ఏర్పాటు చేశాడు. విందుకు వచ్చిన వారిని ఆహ్వానించేందుకు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నియంత్రించేందుకు 25 మంది జూనియర్ ఆర్టిస్ట్‌లను నియమించుకున్నారు. వీరందరూ సఫారీ డ్రెస్‌లు వేసుకుని రావాలని చెప్పడంతో శ్రీకృష్ణానగర్‌లోని డ్రెస్‌లు అద్దెకిచ్చే షాపులో రేవంత్ అనే జూనియర్ ఆర్టిస్ట్‌తో పాటు మరో 24 మంది డ్రెస్‌లు తీసుకున్నారు. ఆదివారం రాత్రి వీటిని తిరిగి ఇచ్చేందుకు వెళ్లగా ఆ షాపు మూసిఉంది. షాపు తెరిచేదాకా అక్కడే ఉండాలని నిర్ణయించుకున్న వీరంతా మాట్లాడుకుంటుండగా పై అంతస్తులో ఉన్న కొందరు యువకులు ఎందుకు న్యూసెన్స్ చేస్తున్నారంటూ వీరిని ప్రశ్నించారు. తాము దుస్తులు ఇచ్చి వెళ్దామని వచ్చామని అల్లరి చేయడం లేదని చెప్పగా పై నుంచి వచ్చిన ఆరుగురు యువకులు వారిపై దాడి చేయడమే కాకుండా తరిమి కొట్టారు. దీంతో వారందరూ అక్కడి నుంచి పారిపోయారు. వీరిని నియమించిన ఏజెంట్ కార్తీక్ అక్కడికి చేరుకుని షాపు తెరిచి ఉందని, దుస్తులు ఇవ్వాల్సిందిగా చెప్పడంతో రేవంత్‌తో పాటు మరో ఇద్దరు అర్ధరాత్రి మళ్లీ షాప్ వద్దకు వచ్చారు. మళ్లీ ఎందుకు వచ్చారంటూ పై నుంచి వచ్చిన అయిదుగురు వ్యక్తులు వారిని షాపులోకి తీసుకెళ్లి చితకబాదారు. వీరి నుంచి తప్పించుకున్న బాధితులు అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

